ప్రజాశక్తి

గురువారం 6 మార్చి 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గుంటూరు కౌన్సిల్‌పై ప్రతిష్టంభన

- మూడు నెలలుగా ఆమోదం పొందని ప్రతిపాదనలు
- రెండ్రోజుల్లో నోటీసు ఇవ్వనున్న మేయర్
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరో పక్షం రోజులు పెండింగ్?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహణపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. డిసెంబరు 20న నిర్వహించాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం స్వల్ప చర్చలతో అసంపూర్తిగా ముగిసింది. తరువాత డిసెంబరు 27కి వాయిదా వేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో ప్రభుత్వం సంతాప దినాలుగా ప్రకటించడంతో 27న సమావేశం జరగలేదు. తిరిగి జనవరి 4న జరిగిన కౌన్సిల్ సమావేశంలో పెద్ద ఎత్తున వివాదం చెలరేగడంతో మేయర్ కావటి మనోహర్ నాయుడు సమావేశాన్ని వాయిదా వేశారు. డిసెంబరు 20న నిర్వహించేందుకు రూపొందించిన ఏజెండాలో 99 ప్రశ్నలు, అభివృద్ధి పనులకు 361 ప్రతిపాదనలతో చర్చ ప్రారంభించగా 23 ప్రశ్నలపై చర్చతోనే అసంపూర్తిగా ముగిసింది. తిరిగి జనవరి 4న జరిగిన సమావేశంలోనూ కేవలం 8 ప్రశ్నలపై చర్చ జరగ్గా కమిషనర్‌కు, డిప్యూటీ మేయర్‌కు మధ్య తలెత్తిన వివాదంతో ఘర్షణ వాతావరణం మధ్య కమిషనర్ సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో కమిషనర్‌కు మద్దతుగా అధికారులంతా బయటకు వెళ్లడంతో మేయర్ సమావేశాన్ని వాయిదా వేశారు. ఆ తరువాత ఇప్పటి వరకు సమావేశం జరగలేదు.

ఫిబ్రవరి 3న స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన కమిషనర్ పులి శ్రీనివాసులు ఈ ఎన్నిక ముగిసే వరకు సమావేశం జరపకూడదని నిర్ణయించారు. గత నెల 3న స్టాండింగ్ కమిటీ ఎన్నికలు



ముగిశాయి. ఈ ఎన్నికలు ముగిసే లోపు .జనవరి 30న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో సమావేశం నిర్వహణ పెండింగ్‌లో పడింది. ఎన్నికల కోడ్ మంగళవారం సాయంత్రం ముగియడంతో గత నెల 4న అర్ధాంతరంగా వాయిదా వేసిన కౌన్సిల్ సమావేశాన్ని తిరిగి నిర్వహించాలని కోరుతూ కమిషనర్‌కు మేయర్ మనోహర్ నాయుడు లేఖ రాయాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న సమావేశం కనుక మూడు రోజుల ముందుగా కార్పొరేటర్లకు సమాచారం ఇచ్చి సమావేశం నిర్వహించవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

ఈ నేపథ్యంలో మేయర్ రెండు రోజుల్లో సమావేశం నిర్వహణపై కమిషనర్‌కు లేఖ రాయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అయితే ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు వల్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమయం ఇవ్వాల్సి ఉందని, సమావేశాలు ముగిసిన తరువాతే జరిగే అవకాశం లేకపోలేదని అధికారులంటున్నారు. అసెంబ్లీ శనివారం సెలవైనా 8వ తేదీన రెండో శనివారం కావడం వల్ల సమావేశం నిర్వహించే అవకాశం లేదంటున్నారు. మార్చి 15న శనివారం మాత్రమే సమావేశం నిర్వహణకు అవకాశం ఉందని తెలుస్తోంది.

గత నెల 3న స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టిడిపి గెలుపొందడంతో మేయర్ స్థానంపై టిడిపి, జనసేన నాయకులు దృష్టి సారించారు. ఈ నెల 17 తరువాత ఎప్పుడైనా మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనకు రంగం సిద్ధం చేస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈపరిస్థితుల్లో పెండింగ్‌లో ఉన్న సాధారణ సమావేశం నిర్వహిస్తారా లేదా అన్న అంశంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. డిసెంబరు 20న ప్రతిపాదించిన ఏజెండా లో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ప్రతిపాదించిన అభివృద్ధి పనులు దాదాపు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించిన ప్రియాంబుల్స్ ఆమోదం పొందే వరకు అభివృద్ధి పనులకు మోక్షం దక్కే అవకాశం లేదు. మేయర్ లేఖ రాస్తే కమిషనర్ ఎలా స్పందిస్తారన్నదీ చర్చనీయాంశమైంది.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు, ప్రజా సంఘాల నాయకులు

పంట కొనుగోలు, వరికపూడిసెలపై కలెక్టర్‌కు వినతి

- పల్నాడు కలెక్టరేట్ వద్ద రైతు, ప్రజా సంఘాల నిరసన
- మిర్చి క్వింటాళ్ రూ.25 వేలకు కొనాలని డిమాండ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

క్వింటాళ్ మిర్చిని రూ.25 వేలకు ప్రభుత్వమే కొనాలని, వరికపూడిసెల ప్రాజెక్టుకు బడ్జెట్లో నిధులు కేటాయించి త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించాలని పల్నాడు జిల్లా రైతు, ప్రజా సంఘాల సమన్వయ సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం అఖిలపక్ష రైతు సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి కలెక్టర్ పి.అరుణ్ బాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు, కౌలురైతు సంఘాల పల్నాడు జిల్లా కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 2.50 లక్షల ఎకరాలలో మిర్చి సాగవుతోందని, రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండి రూ.లక్షలు అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ధరల స్థిరీకరణ నిధి ద్వారా మిర్చి, ధాన్యం, అపరాలు పంటలను కొనాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం 2లో



రంజాన్ సమయాలు

ఇఫ్తార్ : 6.21 (గురువారం - సాయంత్రం)

సహర్ : 5.05 (శుక్రవారం - ఉదయం)

రూపాయి ఇవ్వకుండానే రూ.5 కోట్లు ఇచ్చినట్లు

చేనేతలకు ఖర్చుపై మంత్రి ప్రకటనలకు చేనేత కార్మిక సంఘం ఖండన

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేతలను టిడిపి కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ అన్నారు. మంగళగిరిలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంగళవారం శాసనమండలిలో చేనేత శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ చేనేతలకు గత జగన్ ప్రభుత్వం కంటే చంద్రబాబు ప్రభుత్వం ఎక్కువ ఆదుకున్నదని మాట్లాడటం దారుణమన్నారు. గత బడ్జెట్లో చేనేత సహకార సంఘాలలోని చేనేత కార్మికులకు రూ.ఐదు కోట్ల త్రిఫ్ట్ ఫండ్‌ను కేటాయించగా ఇప్పుడు ఒక్క రూపాయి కూడా కార్మికులకు ఇవ్వకుండా రూ.ఐదు కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి మాట్లాడ్డం సిగ్గుచేటని విమర్శించారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లకు ఉచిత కరెంటుకు రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారని, ఉచిత కరెంటుకు చేనేత కార్మికులు దరఖాస్తులు పెట్టి కరెంటు ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా జీవో రాలేదని విద్యుత్ ఎఇలు చెబుతున్నారని తెలిపారు. సిఎం చంద్రబాబు ఆగస్టు 7వ తేదీన 200 యూనిట్లు ఉచిత కరెంటుకు, జీఎస్టీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చానని ప్రకటించినా అమలు కాలేదన్నారు. చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేసి పరికరాలు ఇస్తున్నామని చెబుతున్నారని, సత్యసాయి జిల్లా సోమండేపల్లి, కర్నూలు జిల్లా



మాట్లాడుతున్న పి.బాలకృష్ణ

ఎమ్మిగనూరు, కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈ పరికరాలు పనికిరావని అక్కడ చేనేత కార్మికులు చెబితే, సోమండేపల్లి చేనేత కార్మికులను విజయవాడ వీవర్స్ సెంటర్‌కు వచ్చి మీకు ఎలాంటి పరికరాలు కావాలో తెలియజేయండి అని అధికారులు అడిగారని తెలిపారు. ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసి చేనేత వస్త్రాల మార్కెట్‌కు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని, నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారని మంత్రి సవిత చెబుతున్నారని, కానీ ఆ ఎగ్జిబిషన్లో 80 శాతం పవర్ లూమ్ వస్త్రాలు అమ్ముతున్న పట్టించుకోవడం లేదని విమర్శించారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.156 కోట్ల పావలా వడ్డీ, యారన్ సబ్సిడీ, రిబేట్ కింద ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించక పోవడంతో చేనేత సహకార సంఘాలలో పనిచేస్తున్న చేనేత కార్మికులకు పనులు లేక ఇతర వత్తులకు వెళుతున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అనంతపురం, సత్యసాయి, కర్నూలు జిల్లాల్లో పవర్‌లూమ్ పోటీకి చేనేత తట్టుకోలేక చేనేతలకు పనుల్లేక ఆత్మహత్యలు జరుగుతున్న విషయం ప్రతిరోజు మీడియాలో చూస్తున్నామని అన్నారు. పవర్‌లూమ్ లను అరికట్టకుండా చేనేతల ఆత్మహత్యలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశ్వారు. ఇలాంటి అబద్ధాలు మానుకొని చేనేతలకు ప్రకటించినవి అమలు చేయాలన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల్లో సిసిటివి కెమెరాలు పెట్టాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి-గుంటూరు

హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని అన్ని సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో (మార్కెటింగ్ శాఖ నోటిపై చేసిన అన్ని జిన్నింగు మిల్లులో) తక్షణమే సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలని, జిన్నింగు మిల్లుల మోసాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని కోరుతూ సంఘం నాయకులు బుధవారం చుట్టుగుంటలోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఎపి ఫైబర్‌నెట్ మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖరాసి సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 2024-25 సంవత్సరంలో రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందని, నకిలీ, కల్తీ విత్తనాలు, చీడపీడలు, కరువు, తుపానులు వంటి అనేక ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొంటూ రైతులు పత్తి సాగు చేశారని చెప్పారు. పెట్టుబడి ఖర్చులు కూడా విపరీతంగా పెరిగాయన్నారు. దిగుబడులు ఆశించినంత రాలేదని, సాగునీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఒక రకంగాను, వర్షాధారంగా ఉన్న ప్రాంతాల్లో ఒక రకంగా పత్తి దిగుబడి వచ్చిందన్నారు. 2023లో క్వింటాళ్‌కు రూ.12వేల నుండి 13వేల వరకూ ధర ఉందని, కానీ 2024లో మొదటి తీత సెప్టెంబర్-అక్టోబర్ నాటికి పత్తి ధరలు అమాంతం పడిపోయాయని, క్వింటాల్‌కు రూ.8వేలకు తగ్గిందని వివరించారు. నవంబర్‌లో రూ.6వేల నుండి రూ.7వేలకు తగ్గిదని, ఈ క్రమంలోనే రైతు సంఘాల ఒత్తిడితో సిసిఐ క్వింటాళ్‌కు రూ.7521ల మద్దతు ధరకు కొనుగోళ్ల ప్రారంభించిందని అన్నారు. అయితే కొనుగోలు కేంద్రాల నియంత్రణ వ్యవసాయ మార్కెట్ యార్డులలో కాకుండా జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి, అక్కడే రైతుల నుండి పత్తి కొనుగోలుకు సిసిఐ చర్యలు చేపట్టిందని, అయితే తేమ శాతం, పత్తి నాణ్యత లేదని సాకులు చూపి మద్దతు ధరకు కొనుగోలు చేయటానికి సిసిఐ, జిన్నింగ్ మిల్లులు నిరాకరించాయని వివరించారు. జిన్నింగ్ మిల్లుల యజమానులు, సిసిఐ అధికారులు కలిసి పత్తి నాణ్యత నిర్ధారించటం, కాటా తూకంలో కూడా మోసాలకు పాల్పడ్డారని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలని రైతులు హైకోర్టును ఆశ్రయించారని, దీంతో కోర్టు వారం రోజుల్లోగా పత్తి కొనుగోలు కేంద్రాల్లో సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేయాలని హైకోర్టు గతేడాది డిసెంబర్ 16న ఉత్తర్వులిచ్చినా ఇంత వరకూ ఏర్పాటు చేయలేదని అన్నారు. కనీసం ఇప్పటికైనా కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య

ప్రజాశక్తి - తెనాలి

కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక ఇస్లాంపేటలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇస్లాంపేటకు చెందిన యర్రంశెట్టి కళ్యాణ్ (30) కూలి పనులకు వెళుతుంటాడు. కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లి, భర్త వేధింపులకు గురి చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన కళ్యాణ్ బుధవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. ఒన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు.

రిటైర్డ్ ఎంపీడీవో మొహిద్దిన్ మృతి



ప్రజాశక్తి - తెనాలి

రిటైర్డ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ) షేక్ మొహిద్దిన్ (71) అనారోగ్యంతో బుధవారం మరణించారు. ఆయనకు భార్య ముంతాజ్ బేగం, కుమారుడు షేక్ ఫయాజుద్దీన్ ఉన్నారు. ప్రస్తుతం కొడుకుతో కలిసి తెనాలిలో ఉంటున్న ఆయన కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ప్రకాశం జిల్లా ఇంకొల్లు ఎంపిడిఒగా పనిచేస్తూ 2007 రిపబ్లిక్ డే వేడుకలలో ఉత్తమ అధికారిగా అప్పటి జిల్లా కలెక్టర్ ఉదయలక్ష్మి నుంచి పురస్కారం అందుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన పాత్రికేయునిగా కూడా పని చేశారు. ఆయన మృతికి పలువురు విశ్రాంత ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.



మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - తెనాలి

మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కొలకలూరు జెడ్‌పి పాఠశాల ఆట స్థలంలో బుధవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పొన్నెకంటి పోతురాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, కోకో పోటీలను నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా ఉల్లాసంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను డ్వాక్రా ఎపిఎం కె.జయశ్రీ ప్రారంభించారు. విజేతలకు ఈనెల 8న నిర్వహించే మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్స్ పొన్నెకంటి చక్రవర్తి ,తుపాకుల ప్రసాద్, డ్వాక్రా యానిమేటర్లు ఎం.సత్యవతి, నాగలక్ష్మి, బేబి, గీత, నవీన, అరుణ, కుసుమలత, భవాని పలువురు మహిళలు పాల్గొన్నారు.

షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో రద్దీగా ఉన్న ప్రాంతాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని వ్యాపారులను డీఎస్పీ బి.జనార్దన్‌రావు కోరారు. గాంధీ చౌక్‌లోని వ్యాపార కూడళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. షాపుల యజమానులతో చర్చించారు. నేరాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని, షాపుల వద్ద సిసి కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. షాపుల యజమానులు కూడా సానుకూలంగా స్పందించినట్లు డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట ఒన్‌టౌన్ సిఐ వి.మల్లికార్జునరావు ఉన్నారు.



రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - తెనాలి





రైలు ఢీకొని వేరువేరు ఘటనలలో ఇద్దరు మృతి చెందారు. వారిలో ఒకరు రైలు ఢీకొని, మరొకరు రైలు నుంచి జారిపడి మృతి చెందారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 60 ఏళ్ల వయస్కురాలు తెనాలి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం చివర పట్టాలు దాటుతుండగా గూడ్సు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన మహిళగా పోలీసులు భావిస్తున్నారు. మరో ఘటనలో తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న సుమారు 50 ఏళ్ల వ్యక్తి పట్టణ శివారు యడ్ల లింగయ్య కాలనీ రైల్వే గేటు సమీపంలో రైలు నుండి జారి పడి మృతి చెందాడు. రెండు మృతదేహాలను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

నెలాఖరుకల్లా భూముల రీ సర్వే పూర్తికి కృషి

ప్రజాశక్తి-ఈపూరు



భూ రీ సర్వేతో గ్రామాలలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. మండలంలోని కొచ్చర్లలో భూ రీ సర్వే పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో ఏడు మండలాల్లో ఏడు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని రీ సర్వే పనులను చేపట్టినట్లు చెప్పారు. కొచ్చర్లలో మొత్తం 5250 ఎకరాలకు 3046 ఖాతాదారులు ఉన్నారన్నారు. వాటిలో 1021 ఎకరాలు ప్రభుత్వ భూమి, 516 ఎకరాలు అసైన్డ్ భూమి, 121 ఎకరాలు దేవాలయ భూమి, 24 ఎకరాలు వక్ఫ్ బోర్డు భూమి, 3488 ఎకరాల పట్టాభూమి ఉందని వివరించారు. ముందస్తుగా రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలో రీ సర్వే చేపడతామన్నారు. 9 (2), 10(2) నోటీసులు అందుకున్న రైతులు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌కు అప్పీలు చేసుకోవాలన్నారు. వేగవంతంగా పనులు చేపట్టేందుకు 15 బ్లాకులుగా విభజించి నాలుగు బృందాలు పని చేస్తున్నాయన్నారు. మార్చి నెలాఖరుకల్లా రీసర్వే పూర్తికి ప్రణాళిక వేసుకున్నామని తెలిపారు. అంగలూరులో అగ్రహారం భూములు (ఉత్తరాది మఠం) 1254 ఎకరాలు హద్దులు గుర్తిస్తున్నామని, త్వరలో సర్వే చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.నళిని, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న మహిళా సాధికారిత వారోత్సవాల్లో భాగంగా గుంటూరు పోలీస్ కళ్యాణ మండపంలో పోలీస్ విభాగ మహిళలకు ఏర్పాటు చేసిన "ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ మ్యాక్సీవిజన్ హాస్పిటల్స్ సంయుక్త సహకారంతో ఈ ఉచిత వైద్య వైద్య శిబిరాన్ని నిర్వహించగా మహిళా కానిస్టేబుళ్లు, సచివాలయ మహిళా పోలీసులు, జిల్లా పోలీస్ కార్యాలయ మహిళా సిబ్బంది, పోలీసుల కుటుంబ సభ్యులు పాల్గొని, హృద్రోగ సమస్యలు, కంటి సమస్యలు, స్త్రీల సమస్యలు వంటి పలు రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించి 117 మంది వైద్య సహాయాన్ని పొందారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ నుంచి డాక్టర్ అన్వేష్ కుమార్, డాక్టర్ రాజశేఖర్ , డాక్టర్ హిమబిందు (గైనకాలజీ), డాక్టర్ శిరీష, డాక్టర్ తేజశ్రీ, కిమ్స్ హాస్పిటల్ నుండి డాక్టర్.మహతి, మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ నుండి డాక్టర్ వంశీ హాజరయ్యారు. ట్రైనీ ఎస్‌పి దీక్ష, అదనపు ఎస్‌పి హనుమంతు, మహిళా విభాగం డిఎస్‌పి సుబ్బారావు, దక్షిణ డిఎస్‌పి బానోదయ, ఆర్‌ఐ శ్రీహరి రెడ్డి, పోలీస్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ ఎస్తేరు రాణి పాల్గొన్నారు.



'పోలీసుల వేధింపుల వల్లే వైసిపి కార్యకర్త ఆత్మహత్యాయత్నం'

ప్రజాశక్తి - వినుకొండ

ఉమ్మడివరానికి చెందిన షేక్ రఫీ పోలీసుల వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. వైసిపి కార్యకర్త అయిన రఫీ స్థానిక టీడీపీ నాయకుల పట్ల చేసిన వ్యాఖ్యల కారణంగా పోలీసుల వద్ద పలు వేధింపులు ఎదుర్కొన్నాడని, అతన్ని తరచూ స్టేషన్‌కు పిలిపించి దారుణంగా కొట్టారని వైసిపికి చెందిన వారు ఆరోపిస్తున్నారు. రఫీని ఎస్ఐ సత్యనారాయణ ఇటీవల స్టేషన్‌కు పిలిపించి దారుణంగా అవమానించి చిత్రహింసలకు గురిచేశారని, టిడిపి నాయకుల కాళ్లు పట్టి క్షమాపణ అడగాలన్నారని రఫీ చెబుతున్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న రఫీని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం పరామర్శించారు. ప్రైవేటు కేసు వేసి రఫీకి న్యాయం కోసం పోరాడతామన్నారు.

అయితే ఈ విషయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చెబుతున్న మాటలు అవాస్తవాలని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఖండించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు విక్రయాలు చేస్తుండగా రెవిన్యూ అధికారులు దాడులు చేసి యంత్రాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారన్నారు. అటువంటి వ్యక్తికి సపోర్ట్ చేస్తూ బొల్లా బ్రహ్మనాయుడు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదన్నారు. పంటకు మద్దతు ధర అడిగినందుకు రైతుపై అక్రమ కేసులు బనాయించిన చరిత్ర బ్రహ్మనాయుడుదని ఎద్దేవా చేశారు. ఉమ్మడివరం సర్పంచి వీరగంధం ఆనంద్ మాట్లాడుతూ రఫీ ఆత్మహత్యాయత్నం డ్రామా అన్నారు. గత వారం క్రితం రఫీ అనే వ్యక్తి గ్రామంలో కొందరిని అసభ్యంగా దూషించటం, అతని దుర్భాషలాడిన వీడియోలు కూడా ఉన్నాయని చెప్పారు.మహిళలను ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ అక్రమంగా మైనింగ్ చేస్తున్న రఫీ లాంటి వ్యక్తులను ప్రోత్సహించడం బ్రహ్మనాయుడుకు తగదన్నారు.



రేషన్ వాహనాన్ని తనిఖీ చేసిన మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శాసన సభ సమావేశాలకు వెళ్తూ మార్గమధ్యలో ఎర్రబాలెం దాటిన తరువాత రేషన్ పంపిణీ వాహనాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ బుధశారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజుకు ఎంత మందికి రేషన్ ఇస్తారు? వినియోగదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. రేషన్ పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు మంత్రికి చెప్పారు. రేషన్ సరఫరాలో లోపాలు ఉంటే సవరిస్తామని మంత్రి అన్నారు.

జీవో ఉపసంహరణ

ప్రజాశక్తి - మంగళగిరి

చర్చిలకు సంబంధించి పంచాయతీ రాజ్ శాఖ జారీ చేసిన జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు మంగళగిరి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు పి.తిమోతి, కేకే రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రైస్తవ ప్రతినిధి డాక్టర్ కొడాలి విజయ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారని, ఆ జీవోను ఉపసంహరించు కునేటట్లు ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు.

మలేరియా అధికారి వీణ సంగీత నాదం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికపై జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలలో బుధవారం రాత్రి మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎ.శ్రీమన్నారాయణ వీణ సంగీత నాదార్చన సేవ చేశారు.

పంట కొనుగోలు, వరికపూడిసెలపై కలెక్టర్‌కు వినతి

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ధరల చట్టం చేయాలని కేరళ తరహా రైతు రుణ విమోచన చట్టం చేయాలని, విద్యుత్ చట్ట సవరణ ఉపసంహరించు కోవాలని స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియ ఆపాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలన్నారు. 100 గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు సాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టుకు 3 సార్లు శంకు స్థాపన చేసినా పనులు చేపట్టలేదన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులు పూర్తి చేయాలని, ఉపాధి హామీని కింద ఏడాదిలో 200 రోజులు పనులు కల్పించడంతోపాటు కనీస కూలి రూ.600 ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టం 1/70 పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రెడ్ బాషా, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు రాంబాబు మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ మాత్రమూ ఉపయోగపడే విధంగా లేదన్నారు. కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలను రైతులకు పెట్టుబడి సాయంగా ఇవ్వాలని కోరారు. పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, కెఎన్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఎన్.కృష్ణ మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేసేందుకు సాగుతున్న పోరాటాలను రైతులు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు, కౌలురైతు సంఘాల జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, కె.రామారావు, ఉపాధ్యక్షులు పి.మహేష్, పిడిఎం నాయకులు ఎన్.రామారావు, మస్తాన్‌వలి, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు కె.కొండలు, పుల్లారెడ్డి, వెంకట్రావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కోటనాయక్ పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

రూ .10 లక్షల బంగారం స్వాధీనం - ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యం

తాడేపల్లి పోలీస్‌స్టేషన్లో నాలుగు కేసులు నమోదు

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో ముఖ్యంగా మహిళలను భయభ్రాంతులకు గురి చేసిన చైన్స్ స్నాచర్ ను తాడేపల్లి సిఐ బి కళ్యాణ్ రాజు. ఎస్సై ఎస్ కే ఖాజావలి తమ సిబ్బందితో కనకదుర్గ వారధి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 125 గ్రాములు బంగారం, సుమారు పది లక్షల రూపాయలు విలువ చేసే బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఇంత పెద్ద ఎత్తున చోరీ సొత్తు స్వాధీనం చేసుకుంటా తాడేపల్లిలో సంచలనం కలిగించింది మంగళగిరి డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ గురువారం సాయంత్రం తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో వివరాలు వెల్లడించారు. పాత మంగళగిరి, ఎన్సిసి రోడ్డు, పాత మంగళగిరి కి చెందిన శీలం కమల్ తాడేపల్లిలోని రోడ్డుపై వెళ్తున్న ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని మహిళల మెడలలోని బంగారాన్ని దొంగిలించుకపోయేవాడు. ఉదయాన్నే ఇళ్ళ ముందు ముగ్గులు వేసుకునే మహిళలు, వాకింగ్ కు వెళ్లే మహిళలు, రోడ్డు పక్కన నడిచి వెళ్లి మహిళలు లక్ష్యంగా చేసుకొని చేకచక్యంగా బంగారం గొలుసులు తెంచుకు పోవడంలో నేర్పరి. తాడేపల్లి పట్టణంలో గత ఆరు నెలల నుండి ఈ రకమైన దొంగతనాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. దీనిపై ఎస్పి ఎస్ సతీష్ కుమార్ ఆదేశాలతో మంగళగిరి డిఎస్ పి సిహెచ్ మురళీకృష్ణ, తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ్ రాజు, ఎస్సై ఎస్ కే ఖాజావలి ప్రత్యేక దృష్టి సారించారు. టెక్నాలజీ ఎవిడెన్స్, ఇన్ ఫార్మర్ల ద్వారా పూర్తి సమాచారంతో బుధవారం కనకదుర్గ వారి వద్ద వాహనాలను తనిఖీ చేసే క్రమంలో స్కూటీపై వెళ్తున్న కమల్ తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాము వెతుకుతున్న అసలైన బంగారపు వస్తువులు దొంగిలించే దొంగ కమల్ అని విచారంలో తేలడంతో పోలీసులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. అతని వద్ద నుండి 125 గ్రాముల బంగారం రూ 10 లక్షలు విలువ చేసేది స్వాధీనం చేసుకున్నారు. స్కూటీని సీజ్ చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిఐ కళ్యాణ్ రాజు, ఎస్ ఐ ఎస్ కే ఖాజావలి, సిబ్బంది ఎం సురేష్ కుమార్, ప్రసాదరావు, పి పరమేష్, వి నాగరాజు లను ఎస్పీ సతీష్ కుమార్, డి.ఎస్.పి మురళీకృష్ణ అభినందించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి

చోరీ కేసుల్లో ఒకరికి జైలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చోరీ కేసుల్లో నేరం రుజువు కావడంతో నాదెండ్ల మండలం కనపర్తి గ్రామానికి చెందిన నిందితుడు ఉప్పుతోళ్ల బాల యేసుకు ఒక్కొక్క నేరంలో ఏడాది జైలు శిక్షను మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు ఇంచార్జ్ న్యాయాధికారి ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి రెడ్డి ఆశీర్వాదం పాల్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గత ఏడాది నవంబర్ 19న రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామానికి చెందిన ఓర్చు కపారావు నరసరావుపేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైందని మొదటి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అదే రోజు రామిరెడ్డిపేటలో షేక్ మహబూబ్ సుభాని మోటార్ సైకిల్ కూడా చోరీకి గురైనట్లు కేసు నమోదయింది. మరో ఘటనలో గీత మందిర్ వద్ద కంభంపాటి వెంకట చలమయ్యకు చెందిన మోటార్ సైకిల్ గత ఏడాది చోరీ గురైనట్లు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయి. పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుని వద్ద నుండి మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నేరం రుజువు అవడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయాధికారి తీర్పు లో పేర్కొన్నారు.

12వ వేతన సవరణ కమిటిని ఏర్పాటు చేయాలి

- ఎపిజిఇఎ అధ్యక్షులు చాంద్‌భాషా

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులకు 2023 జులై 1 నుండి ఇవ్వాల్సిన 12వ వేతన సవరణపై జ్యుడిషియల్ కమిటిని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా కోరారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డి.ఎ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలపై షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు.సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరీముల్లా షాఖాదరి, నగర అధ్యక్షులు నాగేశ్వరరావు, నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, షబానా సుల్తానా పాల్గొన్నారు.

రాజధానిలో పర్యటించిన ప్రపంచ బ్యాంక్ బృందం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో బుధవారం ప్రపంచ బ్యాంక్ బృందం పర్యటించింది. ఈ బృందంలో కో-టాస్క్ టీం లీడర్ గెరాల్డ్ ఒలివర్, అర్బన్ స్పెషలిస్ట్ కిన్‌గ్విన్ షెన్, ప్రొక్యూర్‌మెంట్ స్పెషలిస్టులు వేదమూర్తి, రాకేష్,వాటర్, శానిటేషన్ కార్యకలాపాల స్పెషలిస్ట్ పొడిపిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రపంచ బ్యాంక్ బృందం నిర్దేశించిన కార్యక్రమాల అమలు, వాటి నిర్వహణ రూపకల్పనపై చర్చించారు. అమరావతిలో నీటి నిర్వహణ ప్రాజెక్టులు, పర్యావరణ, సామాజిక రక్షణకై రూపొందించిన కార్యకలాపాలు, ప్రొక్యూర్‌మెంట్ సంబంధిత విషయాలపై సిఆర్‌డిఎ అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాజధాని అమరావతి అభివృద్ధి కోసం ఏర్పాటు కానున్న మిషన్ కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించే క్రమంలో భాగంగా సామర్థ్య నిర్మాణ అవసరాలు, స్థానికులు,యువతకు నైపుణ్యాభివృద్ధి, నియంత్రణ, కమ్యూనికేషన్ అంశాలు మొదలైన వాటితో కూడిన ప్రణాళికలతో ఈ మిషన్‌ను ఏర్పాటు చేసేందుకు సి ఆర్ డి ఎ స్ట్రాటజీ విభాగ అధికారులతో చర్చించారు.

బొమ్మరాజుపల్లి తండాలో మిరపకాయలు చోరీ

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని బొమ్మరాజుపల్లి తండాలో మిరపకాయలు చోరీ జరిగిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. బాధితుడు భూక్యా కృష్ణ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం తండా సమీపంలో ఎనిమిది ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాడు. పంట కోతకు రావటంతో మిరపకాయలు కోసి కల్లంలో ఆరబోశాడు. సుమారు 25 క్వింటాలు మిరపకాయలను కల్లంలో ఆరబోసి ఎండిన అనంతరం మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసుకున్నాడు. మంగళవారం రాత్రి బొగ్గరం తిరుణాళ్లకు వెళ్లి మరుసటి రోజు మిర్చి కల్లం వద్దకు వెళ్లి చూడగా మిరపకాయలు తక్కువగా కనపడడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఎనిమిది క్వింటాల మిరపకాయలు చోరీ అయ్యాయని కృష్ణా నాయక్ వాపోయాడు. చోరీ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. అయితే కొద్ది రజుల క్రితం కూచినపల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన మిరపకాయలు చోరీకి గురయ్యాయి. వరుస మిర్చి చోరీ ఘటనలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఇంటర్ పరీక్ష లు ప్రారంభమైన సంగతి తెలిసిందే. పరీక్షల నిర్వహణకు పట్టణంలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష జరుగుతుండగా ఆయా పరీక్ష కేంద్రాలను తహసిల్దార్ పరిశీలించి, పరీక్ష కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంట్ల ద్వారా వివరాలను తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విశ్వ జూనియర్ కళాశాల, టూ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులోని నారాయణ, శ్రీ చైతన్య తదితర పరీక్ష కేంద్రాలలో విద్యార్థుల హాజరు శాతం, సీటింగ్ ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరును పరీక్షించారు.

ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలోని నరమలపాడు గ్రామ శివారులో బుధవారం తెల్లవారు జామున ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలోకి దూసుకు వెళ్ళటంతో డ్రైవర్ ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. కాకినాడ జిల్లా, పత్తిపాడు మండలం, చింతలవూరు గ్రామానికి చెందిన తాడి.సత్తిబాబు (40) పల్నాడు జిల్లా, వినుకొండ నుండి తెలంగాణ సూర్యపేట కు సుబాబులు చెట్లు నరకడానికి వెళ్తున్న తరుణంలో మండలం, లోని నరమలపాడు శివారులో ట్రాక్టర్ అదుపుతప్పడంతో డ్రైవర్ కింద పడిపోవడంతో ట్రాక్టర్ టైర్ అతని పైకి ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారంపూడి ఎస్సై వాసు సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన వ్యక్తిని పోస్టుమార్టం నిమిత్త గురజాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

దొంగను పట్టించిన సిసి కెమెరా

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని పల్లలమ్మ చెరువు కట్టపై ఉన్న దుకాణంలో బుధవారం తెల్లవారు జామున గుర్తుతెలియని యువకులు చోరీకి పాల్పడ్డారు. కుక్కలు అరవడంతో యజమాని రవి మేల్కోని తన దుకాణంలో ఉన్న సిసి కెమెరాని తన మైబైల్‌తో పరిశీలిస్తే దుకాణంలో ఎవరో యువకుడు చొరబడినట్లు గుర్తించాడు. వెంటనే సమీపంలోని ఇరుగు పొరుగును కూడగట్టుకుని దుకాణం దగ్గరకు వెళ్ళగా దుకాణం బయట మరొక ఇద్దరి ఉన్నారు. వారిని గమనించి పట్టుకునే లోపు పరారైయ్యారు. దుకాణం లోపల ఉన్న యువకుడిని స్థానికులతో కలసి షాపు యజమాని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువకుడు క్రోసూరుకు చెందిన షేక్ సాజిత్ గ గుర్తించారు. నిందితుడిపై ఏమైన కేసులు ఉన్నాయ అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహారాజశ్రీ 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో గుంటూరు

O.S.No. 54/2021

Between:

బొలిశెట్టి సరస్వతి - వాది

మరియు

పోతుగుంట్ల సాంబశివరావు -ప్రతివాది

To

పోతుగుంట్ల సాంబశివరావు తండ్రి. చిన్న అమరయ్య R/O DO NO. 134-1-160, ద్వారకానగర్, 4వ లైను, నగరాలు, గోరంట్ల, గుంటూరు

పై నెంబరు గల దావా నందు వీరు మీ తరుపున లాయరు గారి ద్వారా ఆన్సరు దాఖలు చేసికొనియున్నారు. దావాలో వాది తన సాక్ష్యంను కోర్టులో దాఖలు చేసినారు. కానీ మీరు గానీ, మీ తరుపు లాయరుగారు గానీ కేసును విచారణ చేయకుండా వుండినారు. పై కోర్టువారు మీకు నోటీసులు జారీ చేసినా మీరు ముట్టని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది ఏమనగా మీకు గానీ మీ తరుపున లాయరు గారి ద్వారా గానీ ది. 28/3/2025న ఉదయం. 10.30 ని.లకు పై కోర్టులో హాజరై పై కేసును విచారణ చేయించు కోవలసినది. లేని ఎడల మీ పరోక్షవలన పై దావాను తీర్మానించబడును.

॥ పై కోర్టు వారి ఉత్తర్వులలో ॥

తెలనాకుల సురేష్‌బాబు, బి.కాం.ఎల్.ఎల్.బి.,

అడ్వకేటు

లైబ్రరీ బజారు, పర్చూరు-523169

బాపట్ల జిల్లా :: 9440333262

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) సత్తెనపల్లి

ఐ.ఎ. 670/2020 ఓ.యస్. 378/2020

బిట్వీన్ :

మంచల నాగిరెడ్డి ....వాది

మరియు

రేపూడి గురవమ్మ .... ప్రతివాది

టు

రేపూడి గురవమ్మ భర్త : (లేటు) గంగయ్య, పెద్దకూరపాడు (ఆనంద్‌పేట) పెద్దకూరపాడు పోస్టు, మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు గల దావా నందు వాది ఎన్నిసార్లు కోర్టువారి ద్వారా సమన్లు, మరియు నోటీసులు జారీ చేసినను, ప్రతివాది సదరు దావా సమన్లు, మరియు ఐ.ఎ.నోటీసులు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున, సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్), సత్తెనపల్లి జడ్జి కోర్టు వారు ఐ.ఎ. నెం. 670/2020, ఓ.యస్. 378/2020 నందు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. వాయిదా తేది: 06-03-2025, పై దావాలో మీకు ఎటువంటి ఆక్షేపణలు వున్నయెడల ది. 06-03-2025 ఉదయం 10-30 గం.లకు మీరు గాని, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనిచో పై దావాలో మీ పరోక్షమున తీర్మానం జరుగునని తెలియ జేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

వాయిదాతేది : 06-03-2025

ఇట్లు

సందెపోగు బాబురావు,

కె.విజయబాబు,

అడ్వకేట్స్, సత్తెనపల్లి.

ఒరిజినల్ పెన్షన్ ఆర్డర్ కాపీ పోయినది

పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం,బరంపేట R/D.No. 1-19-180 కు చెందిన గరికపాటి బుల్లెమ్మయీ w/o గరికపాటి కృష్ణదాస్ (లేట్) అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నరసరావుపేట పురపాలక సంఘం కార్యాలయంలో పని చేస్తూ 1994 లో పదవి విరమణ పొంది పెన్షన్ (Pensioner Id-80208565, RPS-2022 PRC, PPO No -S0013-NRT-MPL) పొందుతున్నారు. కాగా ది.10-12-2024 నా భర్త మరణానంతరం ఆయనకు సంబంధించిన పెన్షన్‌పేమెంట్ ఆర్డర్ కాపీ కనిపించడం లేదు. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రెస్‌లో లేదా సెల్ నెం. 9010132508 నందు సంప్రదించగలరు. అట్లు కాకుండా సదరు కాపీ ఎవరికైనా దొరికి దానిని దుర్వినియోగ పరిస్తే చట్ట ప్రకారం నేను తీసుకొను చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్

(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ) రి.నెం. **ABC-CS/006/2015,**
H.O. ABCCS, Endowments Commissionersate Campus, Gollapudi, Vijayawada, Krishna (D), A.P - 521 225, Ph : 0866-6650307
B.O : ABCCS, C/o Yadavalli Vari Satram, Beside Modern Theatre, Kothapeta, Guntur, Guntur(D), A.P.-522201. Ph : 0863-2958557, 9281029467

ఈ ప్రకటనలోని వారి తాలూకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తి సొసైటీ నందు తనఖా పెట్టి, అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్తి తనఖాపై సొసైటీవారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖిత పూర్వకంగా వారి అభ్యంతరములను రిజిష్టరు పోస్టు విత్ ఎక్నాలెడ్జ్‌మెంట్ ద్వారా మా సొసైటీకి తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
	Mrs. Velagapudi Haripriya W/o Velagapudi Bala Bhaskara Rao App No. 93261 Mobile No. 9989088408 Mr. Munnangi Srinivasa Kumar S/o MVVSN Sarma App No. 93455 Mobile No. 9985110510	A) An extent of undivided and unspecified site of 44.58 Sq.yards or 37.27 Sq. Mtrs of site out of 891.740 Sq. yards or 745.61 Sq. Mtrs of site in Demarcation No. 921/2-an extent of Ac.0.98 cents D.No. 922-an extent of Ac.2.62 cents (in total comes Ac. 3.60 cents) situated at Ankireddypalem Village, Challavari palem Gram panchayat, Nallapadu Sub District, Guntur District, being bounded by (As per tax receipt Assessment No. 1745 Door No.17-45) B) Sri Lakshmi Srinivasa Nilayam First Floor Flat No. 201 with plinth Area of 1055 sft (including Common area and stilt car parking)

Guntur
Dt. 05/03/2025

Branch Manager
Sd/- DVS PAVAN KUMAR
Cell : 9281029467

IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE AT: GAJUWAKA
A.S.10/2020

Between:
Sri Korra Vijaya Kumar,
Rep. by its G.P.A. Holder
Sri Korra Srinu ...Appellant
And:
Amaripalli Ramanamma & others ...Respondents

NOTICE

To,
Respondent No.2:
Smt. Yelamanchili Sita Devi,
W/o. Yelamanchili Lakshmaiah
R/at D.No.5-77-1,
Pandari Puram,
GUNTUR.

Please take notice that the above named appellant filed the above Appeal against you and the appeal stands posted to **19-03-2025** for your appearance.You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **19-03-2025** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
A.S. RAMA SARMA
G. SRINIVAS
Advocates, Visakhapatnam.
Cell : 94407 94272

నటుడు పోసాని కృష్ణమురళి బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సినీ నటుడు, రచయిత, ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోసాని కృష్ణమురళి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం విచారణ జరగనుంది. పట్టణానికి చెందిన టిడిపి నేత కొట్టా కిరణ్ కుమార్ ఫిర్యాదు మేరకు గతేడాది నవంబర్ 14న నరసరావుపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న కృష్ణమురళిని ఇటీవల టూటౌన్ పోలీసులు పిటి వారెంట్ పై అన్నమయ్య జిల్లా రాజంపేట నుండి నరసరావుపేట కోర్టులో హాజరు పరిచారు. ప్రస్తుతం ఆయన రిమాండ్‌లో ఉండగా విచారణ కోసం వారం రోజులు పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉంది. పోలీస్ కస్టడీ పిటిషన్‌పై పోలీసులు కోరిన మేరకు కస్టడీకి ఎందుకు ఇవ్వకూడదో కృష్ణమురళి తరపు న్యాయవాదులు బుధవారం సమాధానం దాఖలు చేయడంతో పాటు వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై గురువారం విచారణ జరగనుంది.



ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

అధికారులతో సమీక్షలో పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పీజీఆర్ఎస్ ఫిర్యాదులు పరిష్కారంలో జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కరంపై మండల స్థాయి అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఫిర్యాదులు ఎక్కడి నుండి వచ్చాయో పరిశీలించి, పరిష్కరించాలని, నేరుగా ముఖ్యమంత్రికి ఇచ్చి వారి ఎండార్స్‌మెంట్ ఉన్న ఫిర్యాదుల విషయంలో సంబంధిత అధికారులు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని చెప్పారు. సంబంధిత పిర్యాదుదారుతో కలెక్టర్/ఎస్.పి నేరుగా మాట్లాడి పరిష్కరించదగినదా లేదా అనేది చూస్తామన్నారు. ఏ ఫిర్యాదూ రీ ఓపెన్ కాకూడదని, ఫిర్యాదుదారుతో అధికారి మాట్లాడాలని, అదేవిధంగా నివేదికను వారికీ ఇవ్వాలని సూచించారు. పీజీఆర్ఎస్ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పీజీఆర్ఎస్ ఫిర్యాదులపైనా 4 స్థాయిల్లో ఆడిట్ నిర్వహిస్తారని, ఫిర్యాదు దారుతో మాట్లాడకపోయినా, నివేదిక వారికీ ఇవ్వక పోయినా, తప్పు ఎండార్స్మెంట్ ఇచ్చినా ఆడిట్‌లో రీ ఓపెన్ చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా సిఎం ఎండార్స్‌మెంట్ ఉన్న ఫిర్యాదుదారులు ఇంకొల్లుకు చెందిన గంటా సుబ్బారావుతో కలెక్టర్ ఫోన్లో మాట్లాడారు. ఫిర్యాదు దారు చెప్పిన అంశములపై దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో సమీక్షించి రికార్డులు వెరిఫికేషన్ కోసం 10వ తేదీ సమయం ఇచ్చారు. మరొక పిర్యాదుదారు అచ్చంపేట మండలం నిందుజెర్లకు చెందిన పి.నాగరత్తమ్మతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కాంరపై పోలీసులకు సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్ అండ్ గో

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని పోలీస్ సిబ్బంది చేపడుతున్నారు. పల్నాడు జిల్లాలోని జాతీయ రహదారుల పై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ప్రమాదాలు జరుగకుండా అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాలను ఆపి డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. రాత్రివేళ జిల్లా వ్యాప్తంగా గస్తీలు నిర్వహించి బస్టాండు, రైల్వే స్టేషన్లలో కొత్త వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

ఎక్కడంటే అక్కడే లీకులు







ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ మున్సిపల్ నీటి పైపులు లీకులు ఏర్పడ్డాయి. ఈ పైపులన్నీ డ్రెయినేజీ కాల్వల పక్కనే ఉండడంతో లీకుల్లోకి మురుగునీరు వెళ్లి అవే ప్రజలకు సరఫరా అవుతున్నాయి. పురుగులు, దుర్గంధంతో కూడిన నీరు వస్తుండడంతో స్థానికులు రోగాల భయంతో బెంబేలెత్తుతున్నారు. పట్టణంలో 10 కిలో మీటర్ల వరకు 30 ఏళ్ల కిందట పైపులైన్లు వేశారు. కొన్నేళ్ల కిందట కొన్ని సిమెంట్ పైపులూ వేశారు. నాణ్యత లేకపోవడం, రెబ్బతిన్న రోడ్ల వల్ల ఒత్తిడికి పడడంతో ఈ పైపులైన్లు తరచూ లీకవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

18న మధ్యాహ్న భోజన కార్మికుల చలో విజయవాడ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మధ్యాహ్నం భోజన పథకానికి రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరుతూ 18వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తుండగా మధ్యాహ్నం భోజన కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం స్థానిక కన్నెగంటి హనుమంతు భవనంలో బుధవారం నిర్వహించారు. సమావేశానికి చీమకుర్తి సుజాత అధ్యక్షత వహించగా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ,పెండింగ్లో ఉన్న జీతాలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ వల్ల అదనపు ఖర్చు పెరుగుతుందని, దానికి అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. సబ్సిడీపై గ్యాస్ ఇవ్వాలని, వంటసామగ్రిని సమకూర్చాలని కోరారు. ఈ అంశాలపై చేపడుతున్న చలో విజయవాడను కార్మికులు జయప్రదం చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన కార్మికులు షేక్ సైదాబి, నాగేంద్రం, వెంకటేష్, షేక్ జానీబి, వర్ల శ్రీలక్ష్మి ఇతర కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమారి


ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న రాయల శ్రీనివాసరావు తదితరులు

వాగ్దేవి విద్యార్థినులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : గుంటూరులోని కిట్స్ కళాశాలలో ప్రముఖ బహుళ జాతి కంపెనీ ఇన్ఫోసిస్ గత నెలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థినులు మేకల మౌనిక, మారెళ్ల శిల్ప ప్రతిభ చాటి ఉద్యోగాలకు ఎంపికయ్యారని నరసరావుపేటలోని వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ఉద్యోగాలు ఎంపికైన వారు డిగ్రీ పూర్తవగానే ఉద్యోగాల్లో చేరుతారని, శిక్షణ కాలంలో వార్షిక వేతనం రూ.3 లక్షలు పొందుతారని తెలిపారు. కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ డిగ్రీ ప్రథమ సంవత్సరం నుండే విద్యార్థులకు ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో శిక్షణ ఇవ్వడం వల్ల తమ కళాశాల విద్యార్థులు 90 శాతం మంది బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ ఏడాది 100 శాతం ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక వృత్తి విద్యా పరమైన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

క్రీడల్లో న్యూటన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన టెక్‌ఫెస్ట్‌లో మాచర్లలోని న్యూటన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కబడ్డీలో ప్రతిభ చూపారని, జెఎన్‌టియు పరిధిలో రెండో బహుమతి సాధించారని కళాశాల సెక్రెటరీ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. క్రీడలు మానసిక శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడలతో ఒత్తిడి దూరమవుతుందని చెప్పారు. విద్యార్థులంతా చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాన్నారు. కబడ్డీలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



వెలగపూడి ఆశయాలను కొనసాగిస్తున్నాం : కెసిపి జిఎం



ప్రజాశక్తి - మాచర్ల

దక్షిణ భారతదేశంలో పరిశ్రమల ఆద్యుడు వెలగపూడి రామకృష్ణ ఆశయాలను కొనసాగిస్తు పారిశ్రామిక అభివృద్ధితో పాటు కార్మికుల భద్రత, సంక్షేమానికి పాటుపడుతున్నామని కెసిపి సిమెంట్స్ జనరల్ మేనేజర్ వెంకటరమణ అన్నారు. కెసిపి వ్యవస్థాపకులు వెలగపూడి రామకృష్ణ 129వ జయంతి ఉత్సవాలు స్థానిక కెసిపి ఆవరణలో మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిఎం వెంకటరమణ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ అభివృద్ధికి పరిశ్రమల స్థాపన ఎంతో అవసరమైనదని గుర్తించిన వెలగపూడి రామకృష్ణ చెక్కర, సిమెంట్ పరిశ్రమలను స్థాపించారని తెలిపారు. పారిశ్రామిక ఆంధ్రావనిలో ఆయన ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించారని చెప్పారు. వ్యవసాయ రంగమే ప్రధాన ఆదాయ వనరైన రాష్ట్రంలో చెక్కెర పరిశ్రమ ప్రాజెక్టులు, నిర్మాణాలకు అవసరమైన సిమెంట్ పరిశ్రమ స్థాపనతో రాష్ట్ర రూపురేఖలు మారిపోయినట్లు చెప్పారు. ఒక్క నాగార్జునసాగర్ ప్రాజెక్టు వల్ల లక్షల ఎకరాల్లో భూమి సాగులోకి రావటం, దాని వల్ల ఆర్థిక పరిస్థితులు మెరుగవ్వటం గమనించొచ్చని అన్నారు. ఆయన వారసత్వాన్ని అంది పుచ్చుకున్న లక్ష్మణదత్తు ఛైర్మన్‌గా అధునాతన సాంకేతకతను ఉపయోగించుకొని పరిశ్రమలను మరింత అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా సంస్థలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులను గోల్డు కాయన్స్, రిస్ట్ వాచ్‌లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కెసిపి అధికారులు జి.శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు శివయ్య, నారాయణ, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ భద్రతా దినోత్సవం

పనిప్రదేశాల్లో అభద్రత చర్యలు, పరిస్థితులే ప్రమాదాలకు కారణమవుతాయని డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక కెసిపి సిమెంట్స్ ఫ్యాక్టరీ ఆడిటోరియంలో 54వ జాతీయ భద్రతా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పరమేశ్వరరావు మాట్లాడుతూ కెసిపి వ్యవస్థాపకులు వెలగపూడి రామకృష్ణ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం హర్షణీయమన్నారు. పదేళ్లుగా ప్రమాదరహిత పరిశ్రమగా కెసిపి నిలవటం గర్వకారణమన్నారు. అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయటం, భద్రతా చర్యలు కఠినంగా పాటించటం వల్లే ప్రమాదరహిత పరిశ్రమ అవార్డు అందుకున్నట్లు చెప్పారు. కెసిపిలో భద్రతకు, నాణ్యతకు పెద్దపీట వేస్తూ అధికారులు తీసుకుంటున్న చర్యలు, దానికి తోడు అవగాహన కల్పించటంలో యూనియన్ నాయకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మహిళా మండలి అధ్యక్షులు సుశీల చెప్పినట్లు భద్రత అనేది కార్మికుడు ఇంటి నుండి బయలు దేరి విధులు నిర్వహించి ఇంటికి చేరే వరకు అప్రమత్తంగా ఉంటేనే ప్రమాద నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి కార్మికుడు తనపై ఆధారపడిన ఒక కుటుంబం ఉందని నిత్యం గుర్తుచేసుకోవాలన్నారు. ప్రమాదం ఎప్పుడూ పొంచి వుంటుందని, చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రమాదాలు నూటికి 98 శాతం మానవ తప్పిదాల వలనే జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరు భద్రతా చర్యలు పై అవగాహన పెంచుకొని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సరావుపేట ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, కెసిపి జిఎం వెంకటరమణ, యూనియన్ నాయకులు నారాయణ, శివయ్య, బండ్ల మహేష్ పాల్గొన్నారు.



రైతుల సమస్యలపై వ్యవసాయ కమిషనరేట్ వద్ద 10న ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

రైతుల సమస్యలపై ఈ నెల 10వ తేదీన గుంటూరు చుట్టుగుంటలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు వివిధ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు తెలిపారు. బుధవారం బ్రాడీపేటలోని పిఎల్‌రావు భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కంచుమాటిఅజయ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, వేల్పూరి నరసింహారావు, రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, బి. కోటయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, వ్యవసాయ రంగంలో కార్పొరేటర్ రంగాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా చేపడుతున్న ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మద్దతు ధరల చట్టం వెంటనే చేయాలని, పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం పూర్తిగా భరాయించాలని, నష్టపోయినప్పుడు పూర్తిగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరల స్థిరీకరణ నిధి రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. రూ.5వేల కోట్లు కేటాయించి పంటలకు కనీస మద్దతు ధర వచ్చేటట్టు చూడాలన్నారు.కౌలు రైతులకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నం చేయటం లేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వమూ వ్యవహరిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఇవ్వాల్సిన రూ.20వేలు ఇంతవరకు అతీగతీ లేదన్నారు. కేరళ మాధిరిగా రైతులకు పూర్తి రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తుల్ని చేయాలన్నారు. మిర్చియార్డును ప్రక్షాళన చేయాలని, కనీసం క్వింటాల్‌కు రూ.20వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై జరిగే ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు నగరంలో మెరుగైన పారిశుధ్యం కోసం శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు సకాలంలో విధులకు హాజరై పారిశుధ్య పనులను పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం పాలఆసుపత్రి వద్ద మస్టర్ పాయింట్, నెహ్రు నగర్, మోతీలాల్ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలో పర్యవేక్షణ సౌలభ్యం కోసం శానిటరీ డివిజన్లు పెంచి, పారిశుధ్య పనులకు అవసరమైన సామాగ్రిని అందించామన్నారు. కార్మికులను డివిజన్ల వారీగా రేషనలైజేషన్ చేశామని, అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనుల్లో మెరుగుదల లేక ప్రజల నుండి పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు ఉదయం మస్టర్ కి సకాలంలో హాజరవ్వడం, పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్మికులు తప్పనిసరిగా ఉదయం మెయిన్ రోడ్ల స్వీపింగ్ పూర్తయ్యాక, ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. మధ్యాహ్నం గ్యాంగ్‌వర్క్ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రైన్లు, పరిసరాలు పరిశుభ్రం చేయాలన్నారు. డివిజన్ల వారీగా ప్రజారోగ్య కార్మికులు తప్పనిసరిగా పారిశుధ్య విధుల్లోనే ఉండాలని, డెప్యుటేషన్లకు అనుమతి లేదన్నారు. పర్యటనలో కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ, సిఎంహెచ్ఓ డాక్టర్ అమృతం, డిఈఈ కళ్యాణరావు తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్

యువత భవితకు క్రీడలు దోహదం

శాప్ ఛైర్మన్ రవి నాయుడు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

యువత బంగారు భవితకు క్రీడలు దోహదపడతాయని క్రీడా శాప్ ఛైర్మన్ ఏ రవి నాయుడు అన్నారు. ఉత్తరాఖండ్ వేదికగా జనవరి28 నుండి ఫిబ్రవరి 14 వరకు జరిగిన 38వ జాతీయ క్రీడల్లో భాగంగా కెనోస్లాలం విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన నగిడి గాయత్రి, మూడవ స్థానంలో నిలిచిన డీ చేతన భగవతి, నాలుగవ స్థానంలో నిలిచిన నగడి రాజేష్‌లు కొలను కొండ లోని క్రీడ శాప్ ఛైర్మన్ కార్యాలయంలో ఛైర్మన్ రవి నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి గాయత్రి మాట్లాడుతూ జాతీయ పోటీలలో బంగారు పతకం సాధించానని ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు థాయిలాండ్ లో జరిగే ఏషియన్ ఛాంపియన్షిప్ కెనాన్ స్లాలం పోటీలలో పాల్గొంటున్నట్లు ఛైర్మన్ కి వివరించారు. స్పందించిన క్రీడా ఛైర్మన్ రవి నాయుడు క్రీడాకారులను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరింప చేయాల్సిన బాధ్యత క్రీడాకారులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షులు రాజశేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులను సత్కరిస్తున్న ఛైర్మన్ రవి నాయుడు

మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్.జి.ఓ హోమ్‌లో రెండో రోజు మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మహిళా ఈ పోటీలకు ఎన్.జి.ఓ సంఘం జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగూరు షరీఫ్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఉద్యోగులకు ఫాన్సీ డ్రెస్, నత్యం, పాటల పోటీలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలను జిల్లా మహిళా ఉద్యోగ విభాగం ఛైర్మన్ రాధారాణి, కన్వీనర్ లక్ష్మీరమ్య, జాయింట్ సెక్రటరీ శివజ్యోతి పర్యవేక్షించారు.అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 200 మంది మహిళా ఉద్యోగులు ఈ పోటీలలో పాల్గొన్నారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర శ్రీనివాస్ రాజశేఖర్, వెంకటరెడ్డి, సుకుమార్, శ్రీధర్‌రెడ్డి సి.టీ శాఖ నాయకులు సయ్యద్ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.




వివిఐటి కళాశాలను సందర్శించిన కెనడా మంత్రి

ప్రజాశక్తి - పెదకాకాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో ద్వైపాక్షిక సంభందాల కోసం రాష్ట్రంలో పర్యటిస్తున్న న్యూఢిల్లీ లోని కెనడా హైకమిషన్ మంత్రి రయాన్ వార్డ్, హైదరాబాద్లోని కెనడా ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్తో కలసి బుధవారం మండల పరిధిలోని నంబూరు గ్రామంలోని వివిఐటి కళాశాలను సందర్శించారు. వివిఐటి ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ లతో కలిసి కళాశాలలోని మౌళిక వసతులు, సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్లను వీక్షించి అనంతరం విద్యార్థులకు కెనడాలో ఉన్న విద్యా ఉపాధి అవకాశాలపై చర్చించారు. వివిఐటి ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు కెనడాలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇరుదేశాల మధ్య పరిశోధనా కార్యకలాపాలకు చర్చించామని తెలిపారు.

13న ఎంటిఎంసి వద్ద ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ఈనెల 13వ తేదీన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ అన్నారు. బుధవారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం ఎస్ ఎస్ చంగయ్య అధ్యక్షతన జరిగింది. జవహర్లాల్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాష్ట్రమంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికలకు ముందు పేదలు వివిధ రకాల భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న వారందరికీ అధికారంలోకి వస్తే పట్టాలిస్తామని వాగ్దానం చేశారని అన్నారు. ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల భూముల్లో ఉన్న ఇబ్బందులను ప్రభుత్వమే తొలగించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మంగళగిరి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. చేనేత కార్మికులకు 24 వేల రూపాయలు సంవత్సరానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పేరుకుపోయిన మురుగు, చెత్తను తొలగించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, వై కమలాకర్, పట్టణ నాయకులు ఎం నాగేశ్వరావు, ఎం చలపతిరావు, కే శ్రీనివాసరావు, జే బ్రాహ్మణి, ఎస్ గణేష్, టి శ్రీరాములు, పి రామచంద్ర రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్

ట్రాఫిక్ సమస్యలు లేకుండా రోడ్ల విస్తరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రధాన రహదారుల విస్తరణ పనులు వేగంగా చేస్తున్నామని నగర కమిషనర్ తెలిపారు. బుధవారం డొంకరోడ్డు వద్ద ఉన్న మూడు వంతెనల ప్రాంతం నుండి చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనుల మార్కింగ్‌ను పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అమరావతి రోడ్ నుండి మూడు వంతెనల వరకు గతంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో కొన్ని ప్రాంతాల్లో పెండింగ్ ఉన్నాయని, శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమైతే ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అలాగే మూడు వంతెనల దగ్గర నుండి శారదాకాలనీ మెయిన్ రోడ్డును కూడా మాస్టర్ ప్లాన్ మేరకు విస్తరణ చేయాలని, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు.

డిఎ బకాయిలు విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ ఆందోళన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

నాగార్జున విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా ఉద్యోగులుగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లు తమకు డిఏ బకాయిలు పెండింగ్లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలని కోరుతూ బుధవారం రిజిస్టర్ ఛాంబర్‌లో బైఠాయించారు. ఆ సమయంలో వీసి అందుబాటులో లేకపోవడంతో రిజిస్టర్ వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ చేసిన మాకు వర్సిటీ నుంచి సకాలంలో సహాయ సహకారాలు అందకపోవటం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని వెంటనే రిజిస్టర్ ఫైనాన్స్ విభాగం అధికారులుగా ఉన్న ఫైనాన్సు అధికారిని పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల అనుమతి ఇచ్చి కూడా రోజులు గడుస్తుంటే తమకు బకాయిలు విడుదల చేయకపోవడంపై రిజిస్టర్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటి రెండు రోజుల్లో బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


మండలి ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ కు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

పేదల గృహాలకు మరమ్మతులు చేయించాలి

మండలి చీఫ్‌విప్ కంచర్ల శ్రీకాంత్‌కు బాధితులు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

దశాబ్ద కాలం క్రితం ప్రభుత్వ పథకం కింద నిర్మించుకున్న పక్కా గృహాల పరిస్థితి కంటిమీద కునుకు లేకుండా చేస్తుందని వాటికి మరమ్మతులు చేయించాలని ఆంధ్రప్రదేశ్ లీగల్ సెల్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది చిలువూరు నాగరాజు ఎపి మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, బాధితులతో కలిసి ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ చౌదరికి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చౌదరి సమస్యను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు చిలువూరు నాగరాజు మాదిగ తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో మాదిగ సామాజిక వర్గంతో పాటు మిగిలిన సామాజిక వర్గ పేద ప్రజల ప్రభుత్వ పథకం కింద కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించుకున్న శాశ్వత పక్కా గృహాలు శిథిల వ్యవస్థకు చేరాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సదరు గృహాలకు సంబంధించిన స్లాబు గోడలు మరమ్మతులు గురికావడం వల్ల ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని ఆర్థికంగా సామాజికంగా బలహీనులైన పేద ప్రజలకు స్వయంగా మరమ్మతులు చేసుకోలేక బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్టేట్ లీడర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నలుకుర్తి కోటేశ్వరరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కాసు కుర్తి నవీన్ మాదిగ, కుక్క మాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయలకు పెరిగిన డిమాండ్


లింగంగుంట్ల సమీపంలో రోడ్డు ప్రక్కన రాశులుగా పోసి ఉన్న పుచ్చకాయలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వేసవిలో వచ్చే పుచ్చకాయకు భలే డిమాండ్ ఉంటుంది. 95 శాతం నీరు కలిగివున్న పుచ్చకాయను తినడం వలన డీహైడ్రేషన్ నుంచి విముక్తి లభిస్తుంది. దీంతో పుచ్చకాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో కాయ సైజును బట్టి రూ 100 నుండి 150 వరకు ఉండే ధర ప్రస్తుతం వ్యాపారులు కిలోల లెక్కన విక్రయాలు జరుపుతున్నారు. కిలో ధర రూ 25 నుండి 30 వరకు విక్రయిస్తున్నారు. శీతల పానీయాలకంటే పుచ్చ కాయలకు ప్రజల్లో విపరీతమైన డిమాండ్ ఉండటంతో పల్లెలు, పట్టణాలు అన్నతేడా లేకుండా వ్యాపారులు పుచ్చకాయలను రాశులుగా పోసి విక్రయిస్తున్నారు. కాగా పల్నాడు జిల్లాతో పరిసర ప్రాంతాలలోని జిల్లాలో రైతులు సాగు చేసిన పుచ్చకాయలు మార్చి చివరి నుండి రానున్న నేపథ్యంలో తమిళనాడు రాష్ట్రం నుండి రవాణా ఖర్చులు కలిపి కిలో రూ.20ల వరకు కొనుగోలు చేస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కాయలకు డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు పోటీ పడుతుండడంతో అతి తక్కువ లాభాలకు విక్రయాలు జరుపుతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. పల్నాడు పరిసర ప్రాంత రైతులకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తే ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదనీ, తక్కువ ధరకు వినియోగదారులకు అందజేసే వెసులుబాటు కలుగుతుండడంతో పాటు ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం చేకూరుతుందనీ, రవాణా ఖర్చులూ భరించాల్సిన అవసరం ఉండదని వ్యాపారులు చెబుతున్నారు.


నకరికల్లు మండలం చేజర్ల గ్రామంలో సాగవుతోన్న పుచ్చకాయలు

బల్లకట్టు సామర్థ్యం, నిర్వహణ తీరుపై జాయింట్ కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లాలో కృష్ణానదీ పరివాహక ప్రాంత మండలాలలో బల్లకట్టులను ఆయా మండల రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటి సామర్థ్యాలపై సమగ్రంగా విచారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుం జయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో బల్లకట్టు, పడవలపై ప్రజలు ప్రయాణించే సమయంలో తీసుకొనవలసిన జాగ్రత్తలు అనుమతులు, లైసెన్సులు లేకుండా బల్లకట్టు, పడవలలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్ని బలకట్టులు ఉన్నాయి, ఏఏ ప్రాంతాల్లో పనిచేస్తున్నాయి, వాటి సామర్థ్యం, నిర్వహణ తీరు వివరాలతో పాటు బల్ల కట్టు మీద ఎంతమంది ప్రయాణిస్తుంటారు, నిర్వాహకులు సరైన రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారా అని అడిగి తెలుసు కున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఇ.మురళి, సత్తెనపల్లి, గురజాల ఆర్డీఓలు, గురజాల డిఎస్‌పి, గుంటూరు జెడ్.పి సిఈఓ, జిల్లా టూరిజం అధికారి, తహాశీల్దార్‌లు పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

కూలీల ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన లారీ

ప్రజాశక్తి - కారంపూడి

ట్రాక్టర్‌ని లారీ ఢీకొట్టిన సంఘటనలో పలువురు మహిళా కూలీల గాయపడిన సంఘటన కారంపూడి మండలం, నరమలపాడు వద్ద బుధవారం చోటు చేసు కుంది. మండలంలోని మిరియాల గ్రామం నుండి నర మాలపాడు మిర్చికోతకు వెళ్తున్న ట్రాక్టరును నరమల పాడు శివారులో.. అమరావతి నుండి ఇసుకల్లోడుతో వస్తున్న లారీ ట్రాక్టర్‌ను వెనుక భాగంలో ఢీకొట్టడంతో వెనక కూర్చున్న పదిమంది మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు చికిత్స నిమిత్తం వీరిలో కొంతమందిని గురజాల హాస్పిటల్‌కు, మరి కొంత మందిని నరసరావు పేట హాస్పిటల్‌కు తరలించారు. పలువురు చిన్న గాయాలతో బయటపడ్డారు.


గాయపడిన మహిళా కూలీ

ఎస్ఎస్ఎన్ కళాశాలలో మెగా జాబ్‌మేళా



జాబ్ మేళాలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ సుధీర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో బుధవారం వివిధ మల్టీనేషన్ కంపెనీలతో మెగాజాబ్ మేళా నిర్వహించారు. 22కంపెనీలలో 450 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఎస్ సుధీర్ తెలిపారు. మెగా జాబ్‌మేళా పెర్ల్ గుంటూరు, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేశారని తెలిపారు. కళాశాల పాలక వర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, సెక్రటరీ, కరస్పాండెంట్, నరసరావుపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, కళాశాల వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు బత్తుల వెంకట మురళీధరరావు, తాడేపల్లి వెంకటభావన్నా రాయణ, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బారావు, పెర్ల్ గుంటూరు సీఈఓ డాక్టర్ ఎం. గురవయ్య, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్, మోహన్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ పుష్పలత పాల్గొన్నారు.

నేడు గీత కార్మికుల మద్యం దుకాణాలకు లాటరీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా గీత సామాజిక వర్గాల మద్యం టెండర్లకు లాటరీ తీయడం జరుగుతుందని ఎక్సైజ్ సూపరిండెంట్ మణికంఠ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుండి కలెక్టరేట్ లో కలెక్టర్ అరుణ్ బాబు సమక్షంలో లాటరీ తీస్తారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా లోని 13 మద్యం దుకాణాలకు గీత సామాజిక వర్గానికి సంబంధించి 199 దరఖాస్తులు వచ్చాయనీ, లాటరీ దక్కించుకున్న వారికి మద్యం షాపులు కేటాయిస్తారని తెలి పారు. టెండర్ దాఖలు చేసిన ప్రతి ఒక్కరు లాటరీ నిర్వ హించే సమయానికి తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొ న్నారు. దరఖాస్తుదారు అప్లికేషన్ కాపీ, ఎంట్రీ పాస్, తహాశీల్దార్ జారీ చేసిన కుల-ఉపకుల ధృవీకరణ పత్రాలను వెంట తీసుకొని రావాలని తెలిపారు. లాటరీలో దుకాణం దక్కించుకున్న దరఖాస్తుదారుడు ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొదటి విడత 1/6 వంతు రిటైల్ ఎక్సైజ్ పన్నులు వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. ప్రతి మద్యం దుకా ణానికి ఒక సెలెక్ట్ అప్లికెంట్, ఇద్దరు రిజర్వ్ అప్లికెంట్స్‌లను ఎంపిక చేస్తామని తెలిపారు.


క్రీడా దుస్తులు బహూకరించిన ఆంజనేయులు

క్రీడా దుస్తులు బహూకరణ

ప్రజాశక్తి - యడ్లపాడు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎడ్లపాడు పాఠశాలకు ఆంజనేయులు (రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎడ్లపాడు) పాఠశాల క్రీడాకారులకు రూ. 10వేల విలువ చేసే క్రీడా దుస్తులను బహూకరించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం విజయభారతి, ఎస్ఎంసి చైర్మన్ రిహానా, పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సెక్రటరీ ఖాదర్ మస్తాన్, పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు పాల్ సుధాకర్, నాగరాజు, షేక్ ఇస్మాయిల్, ఏఎంజి రాజు, శ్రీకాంత్, మధు, అమీర్ ఎడ్లపాడు అషితున్ పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ క్రీడలలో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి కోరారు. క్రీడా దుస్తులు బహూకరించిన ఆంజనేయులుకి పాఠశాల ఉపాధ్యాయులు చిలకలూరిపేట జోనల్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సన్మానించడం జరిగింది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - కారంపూడి

54వ జాతీయ భద్రతా వారోత్సవాలను కారంపూడి శివారులోని శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ ఇంచార్జ్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడానికి భద్రతను అనుసరించాలన్నారు. అనంతరం పరమేశ్వరరావు, రాంబాబు భద్రత పథకాన్ని ఆవిష్కరించారు. కార్మికులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనములు పోటీల్లో పాల్గొన్న విజేతలకు పరమేశ్వరరావు, రాంబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీలో పని చేస్తున్న వివిధ విభాగాల అధిపతులు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది

ప్రాంగణ ఎంపికల్లో 26 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విశాఖపట్నంకు చెందిన ప్రముఖ సాఫ్ట్ స్కిల్ కంపెనీ నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని పాలడుగు నాగయ్య చౌదరి కొత్త రఘురామయ్య కళాశాలలో బుధవారం పలు కళాశాలలకు చెందిన డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాల విద్యార్థులు 21 మంది ఇతర కళాశాలల విద్యార్థులు 5 మంది కొలువులు సాధించారని కళాశాల జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాస ప్రసాద్ తెలి పారు. రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ముఖా ముఖి ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ డాక్టర్ మేదరమెట్ల ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా తమ కళాశాలలో ప్రాంగణ ఎంపిక నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ప్రిన్సిపల్ కె.హరిక్రిష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశము ఈనెల 12వతేదీ ఉదయము గం.11.00లకు మండల ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో నిర్వహిం చనున్నట్లు ఎంపిపి కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సమావేశానికి యడ్లపాడు మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులందరూ తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరు కావలసినదిగా తెలిపారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపిడిఓ, స్వచ్ఛ మిత్రలు

యడ్లపాడులో చెత్త తొలగింపు

ప్రజాశక్తి - యడ్లపాడు

స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎడ్లపాడు పంచాయతీ పరిధిలో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి పంచాయతీ కార్యదర్శి శశికళ స్వచ్ఛ మిత్రలు పాల్గొన్నారు.

మహిళల బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు వెంకటేశ్వరి ఎంపిక

ప్రజాశక్తి-ఈపూరు


వెంకటేశ్వరి

ఈనెల 3, 4 వ తేదీలలో నరసరావుపేటలోని ఎంఎఎం ఫార్మసీ కళాశాలలో జరిగిన మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన విద్యార్థిని కె వెంకటేశ్వరి ప్రతిభ కనబరిచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు బుధవారం తెలిపారు. ఈనెల 29వ తేది నుండి ఏప్రిల్ ఒకటి వరకు తమిళనాడు రాష్ట్రం లోని అలగప్పా యూనివర్సిటీలో జరిగే అంతర విశ్వ విద్యాలయ పోటీలలో వెంకటేశ్వరి యూనివర్సిటీ జట్టు కు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్ బలరాం నాయక్, ఎం దాసు, సిహెచ్ అరవింద్, కె వంశీ చైతన్య అభినందించారు.

ఖాళీ స్థలాలపై నిర్లక్ష్యం తగదు : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ఖాళీ స్థలాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రజలకు అనేక సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. ఈ అంశాన్ని ఆమె బుధవారం శాసన సభలో మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. జీరో అవర్ లో ఈ అంశాన్ని లేవనెత్తారు. డంపింగ్ యార్డులు ఊరికి చివరన ఉంటాయని, కానీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఇళ్ళ మధ్యలో ఖాళిస్థలాలు ఉండటం వలన అవి మినీ డంపింగ్ యార్డులు మాదిరిగా తయారు అయ్యి ప్రజలు అనారోగ్యానికి గురవ్వటమే కాక విష సర్పాలు చేరి, సమీప ఇళ్ళు, అపార్ట్ మెంట్లలోకి చేరుతున్నాయని, ఇదే కాకుండా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగటం వలన అనేక మంది వ్యక్తులు ఖాళీ స్థలాలలో మద్యం సేవించటం, గంజాయి వంటివి మాదక ద్రవ్యాలు తీసుకొని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇదే విషయాన్ని గత అసెంబ్లీ సమావేశాలలో లేవనేత్తానని, ఖాళి స్థలాల విషయంలో మంత్రి పొంగూరు నారాయణ వెంటనే నిర్ణయం తీసుకోవాలని మాధవి కోరారు.

9న సుందరయ్యనగర్‌లో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లి

ఈనెల తొమ్మిదో తేదీ ఆదివారం తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్‌లో ప్రగతి స్కూల్లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పూర్వపు జిల్లా గవర్నర్ లయన్ మిరియాల వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం కమిటీ చైర్ పర్సన్ లయన్ పి సుజాత రావు లయన్ రామిశెట్టి కొండలరావు, కోఆర్డినేటర్, ప్రోగ్రాం కన్వీనర్ తెలిపారు. బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగే ప్రగతి హై స్కూల్ లోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ మెగా వైద్య శిబిరం ఆదివారం ఉదయం 9 గంటల నుండి ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా లయన్ శేషగిరి(పీఎం జె ఎఫ్, జిల్లా గవర్నర్ 316 డి), ఆత్మీయ అతిధులు లయన్ వి వి పి ఎస్ ఆంజనేయులు(పి ఎం జె ఎఫ్ మొదట వైస్ గవర్నర్) పాల్గొంటారని చెప్పారు. మెగా వైద్య శిబిరం లో బిపి, షుగరు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యంతో పాటు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయబడుతుందని వివరించారు. గుండె సంబంధిత వ్యాధులు తో పాటు మహిళలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులు, జనరల్ వ్యాధులకు కూడా వైద్యశాలను పొందవచ్చు అని సూచించారు. గుండె ఈసీ జి, ఎకో స్కానింగ్, గుండె మరియు కంటి, దంత, మూత్ర సంబంధిత పరీక్షలు నిర్వహించ బడతాయని తెలిపారు. ఆయా విభాగాల్లో నిష్ణాత్తులైన 16 మంది డాక్టర్లు ఈ మెగా వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని తాడేపల్లి పట్టణంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, రూరల్ గ్రామాల్లోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ప్రగతి హైస్కూల్ ఎండి ఎస్ వెంకటరావు, ఏంటీఎంసీ బాలోత్సవం ప్రతినిధులు గాదె సుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిరియాల వెంకటేశ్వరరావు, తదితరులు

రైల్వే అధికారి బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రైల్వే డివిజనల్ ఆపరేటింగ్ మేనేజర్ ఎం.దినేష్‌కుమార్ బుధవారం విజయవాడకు బదిలీ అయ్యారు. ఈమేరకు ఆయన గుంటూరులో రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు డిఆర్ఎం ఎం.రామకృష్ణ, పలువురు అధికారులు వీడ్కోలు పలికారు.

92 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశ క్తి - తాడేపల్లి

తమ కున్యాయంగా రావలసిన బకాయిల కోసం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 92 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎం శారద, డి రమణ, కే లక్ష్మి, జి అన్నమ్మ, యు రమణ కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడే పల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయ కులు కొరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా వందల కుటుంబాలకు న్యాయం జరిగే కార్మికుల సమస్యను పట్టించుకోవాలని కోరారు. మంత్రి నారా లోకేష్ గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, ఎం సాంబశివరావు, టి నాగేశ్వరరావు, డి.దానయ్య, వై.సాంబశివరావు, ఎన్ సుబ్బా రావు, వై రమాదేవి, పి బుజ్జి, ఎస్.కె ఇమాంబి, ఎం శివ మా, ఈ సారమ్మ, డి బేబీ, ఏ విజయ శ్రీ, డి మల్లేశ్వరి, టి దుర్గ భ వాని, ఈ రిబ్కా, బి అంకయ్య పాల్గొన్నారు.

మహిళ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయండి: ఎంపిడిఓ

ప్రజాశక్తి-తెనాలిరూరల్ తెనాలి మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జా తీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ అత్తోట దీప్తి బుదావరం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 7న కొత్తపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న వేడుకల్లో తెనాలి సబ్ కలెక్టర్ వి సంజన సింహ ముఖ్య అతిధిగా పాల్గొననున్నారని చెప్పారు. మండల పరిధిలోని వివిధ శాఖల మహిళ అధికారిణి లు కూడా హాజరౌతారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించేందుకు వారు తయారు చేసిన చేతివత్తుల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు ఆమె చెప్పారు. మహిళా ఉద్యోగుల గౌరవార్థం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



మహిళలకు నిర్వహిస్తున్న ఆటపోటీలు

కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి, పెదనందిపాడు: పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోరి బాలికలకు భవిష్యత్తు ఉద్యోగ అవకాశాల గురించి బుధవారం అవగాహన కార్య క్రమం నిర్వహించారు. చదువు, బాల్యవివాహాల గురించి మహిళా పోలీస్ బిందు మాధవి వివరించారు. కార్యక్రమం లో కిశోరి బాలికలతో యోగ చేయించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో అంగన్వాడి సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. లెమన్ అండ్ స్పూన్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా హేమలత, కమలా దేవి, ఉదయలక్ష్మి గెలుపొందారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వై రాజ్యలక్ష్మి, జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపా ధ్యాయురాలు ఎన్ లక్ష్మీ దుర్గ, అంగన్వాడి టీచర్స్ వి అమరేశ్వరి, ధనలక్ష్మి, పద్మ, సైదాబీ, కమల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా పోలీస్ బిందు మాధవి

ఆకట్టుకున్న మద్యపానంపై విద్యార్థుల దృశ్య రూపకం



దృశ్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీ హెచ్‌సిలో ఎయిమ్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యం లో బుధవారం మద్యం సేవించడంపై కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తూ విద్యార్థులు దృశ్య రూపకం ప్రదర్శించారు. మద్యం సేవించడం వల్ల ఆరోగ్యంపై చూపే దుష్ప్రభావాలు, కుటుంబానికి జరిగే నష్టాన్ని తెలియజేస్తూ నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించిన దశ్య రూపకం పలువురు రోగులను విశేషంగా ఆకట్టుకుంది. మానసిక సమస్యలపై ఉన్న అపోహలు, మద్యం మాను కోవటం సాధ్యమైంది వంటి వాటిపై చిత్రాలు గీసిన చార్ట్‌లను ప్రదర్శించారు. మానసిక ఆరోగ్య సమస్యలు ముందస్తు హెచ్చరిక సంకేతాలపై, చిత్రాలతో రూపొందించిన మీ ఆరోగ్యం, మీ చేతుల్లో ఉంది అనే కరపత్రాలను రోగులకు పంపిణీ చేశారు. కాలేజీ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధనుస్సు, అసోసియేట్ ప్రొఫెసర్, సైక్రియాటిస్ట్ డాక్టర్ మూర్తు వెంకటాచలం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మద్యం సేవించడం వల్ల మనిషి ఆరోగ్యం ఎలా దెబ్బతింటుంది, కుటుంబానికి జరిగే నష్టంపై నర్సింగ్ విద్యార్థుల ద్వారా దృశ్య రూపకంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎయిమ్స్ సైక్రియాటిస్ట్ ఓపిడిలో మద్యపానం ఎలా మాన్పించాలో వివరించే పునరావాస కేంద్రం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ శ్రీనివాస్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష, ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ నెహమ్మ, నర్సింగ్ ఫ్యాకల్టీ వల్లెపు పద్మ, కాళేశ్వరి పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్లో ఆటల పోటీలు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పరిధిలోగల ఏపీఎస్పీ బెటాలియన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ఏపీఎస్పీ బెటాలియన్ ల మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. బెటాలియన్ లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది, డిజిపి ఆఫీసులో పనిచేస్తున్న మహిళా సిబ్బంది పోటీలలో పాల్గొన్నారు. పోటీలను కమాండెంట్ కే నగేష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఆరఐఆర్ సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.



బేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో విద్యార్థులు

బేటి బచావో బేటి పడావో

ప్రజాశక్తి మంగళగిరి

కాండ్రు కమల మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మంగళగిరి నందు బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగం గా ఆడపిల్లలకు విద్య యొక్క ప్రాముఖ్యత ,బాల్య వివాహాలు మరియు క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి రత్నకుమారి, ప్రధానోపాధ్యాయులు షేక్ దర్యావలి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలంలోని మోరంపూడి గ్రామంలో మంగళవారం రాత్రి ముగిసిన బాబు జగ్జీవన్ రామ్ మెమోరియల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో ఆతిధ్య గ్రామానికి చెందిన సురేష్ యూత్ జట్టు విజేతగా నిలిచినది. మొత్తం 30 టీంలు పాల్గొన్న ఈ టోర్నమెంట్లో గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు ఇత్తడి చంటి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలలో అదే గ్రామానికి చెందిన బాబు జగ్జీవన్ రామ్ యూత్ రెండవ స్థానంలో బాపట్ల కు చెందిన తేజ రెడ్డి యూత్ మూడో స్థానంలో నిలిచాయి. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు నీటి సంఘాల అధ్యక్షుడు గొర్నెని అనిల్ మొదటి బహుమతి కింద 20116 రూపాయలు బహుమతిని అందించగా రెండో స్థానంలో నిలిచిన వారికి మాజీ యాడ్ చైర్మన్ కొండూరు ముత్తయ్య 15116 రూపాయలు మూడో స్థానంలో నిలిచిన వారికి జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస శర్మ 10116 రూపాయలు బహుమతులను అందజేశారు. గ్రామ సర్పంచ్ ఇత్తడి రమేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోరికపూడి కుమార్ బాబు మోరంపూడి గోపి అత్తోట జోషి బాబు శంగారపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన రేపూడి జట్టు



గిరిజనులతో మాట్లాడుతున్న దిలీప్ రాజా

పక్కా గృహాలు గిరిజనుల కల

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నిరుపేదలకు సాయం చేయడం సామాజికసేవలో ఒక భాగమని సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. తెనాలి శివారు ప్రాంతాల్లో జీవిస్తున్న నిరాశ్రయ గిరిజనులకు బుధవారం "ఫర్ ది లీస్ట్ ఆఫ్ దెమ్ ట్రైబల్ మినిస్ట్రీ" తరపున నూతన వస్త్రాలు, బియ్యం పంపిణి చేశారు. సంస్థ డైరెక్టర్ రావూరి అంజలి నిర్వ హించిన గిరిజన సంక్షేమం సమావేశంలో ఆయన ముఖ్య అతిథి గా పాల్గున్నారు. దిలీప్ రాజా మాట్లాడుతూ గిరిజన నిర్వాసితు లకు శాశ్వత ప్రతిపాదికన పక్కాగృహాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. కార్యక్రమంలో రావూరి సురేష్ బాబు, దర్శకులు మణివరన్, నరేష్ దోనే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఓ డాక్టర్ సునీత

పిల్లలలో పౌష్టికాహార లోపంపై అవగాహన

ప్రజాశక్తి తెనాలి

ప్రతినెల 5వ తేదీన అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల్లో పౌష్టికాహార లోపంపై నిర్వహించే అవగాహన కార్య క్రమం బుధవారం గ్రామం కంచర్లపాలెం అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించారు. సిడిపిఓ డాక్టర్ ఎం.సునీత మాట్లాడుతూ ఆరు సంవత్స రాల లోపు పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు పలు సూచనలు చేశారు. పిల్లల ఎత్తు, బరువు కొలిచి పిల్లల పోషణ స్థితిని వారికి తెలియజేశారు. పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను సాధారణ స్థాయికి తీసుకు రావడానికి ఇంటి దగ్గర వారు తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. కోడిగుడ్డు, పాలు, పప్పు దినుసులు, ఆకుకూరలు, పండ్లు మొదలైనవి పిల్లలకు ఇచ్చేఆహారంలో రోజు ఉండేలా చూసుకోవాలని, పిల్లలకు ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో సిడిపిఓ సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు చిన్నారులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని కమర్షియల్ సంస్థలను సీజ్ చేయడం, నివాసాలకు ట్యాప్ కనెక్షన్‌లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఆదేశాల మేరకు మిర్చియార్డ్, నల్లపాడురోడ్, శ్యామలనగర్, స్తంభాల గరువు, హనమయ్య నగర్, నల్లచెరువు, ఎల్ఆర్ గాంధీనగర్, స్వర్ణాంధ్రనగర్ తదితర ప్రాంతాల్లో కమర్షియల్ సంస్థ సీజ్, ఇతర నివాసాలకు మున్సిపల్ ట్యాప్ కనెక్షన్లను రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పన్నుల వసూళ్లు కీలకమని, నగరంలోని పన్నుదార్లు సకాలంలో పన్ను చెల్లించి జిఎంసికి సహకరించాలన్నారు. పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉండే వారికి జిఎంసి నుండి అందించే మున్సిపల్ ట్యాప్ కనెక్షన్, డ్రైనేజి కనెక్షన్ తొలగించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగింపునకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు.



ట్యాప్ కనెక్షన్లు తొలగిస్తున్న సిబ్బంది

కఠోర శ్రమతోనే ఉన్నత విజయాలు సాధ్యం

భాష్యం వార్షికోత్సవాల్లో అతిథులు

ప్రజాశక్తి-గుంటూరు

పుట్టుకతోనే ఎవరూ ప్రతిభావంతులు కారని, మీరు చేసే కఠోర శ్రమతోనే ఉన్నత విజయాలు అందుకోవచ్చని ప్రముఖ వైద్యు రాలు, కోమలి ఫెర్టిలిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ స్వప్నశ్రీనాథ్ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉడాన్ పేరుతో మూడ్రోజులపాటు గుంటూరు అర్బన్ జోన్-2 (నగరాలు, పట్టాభిపురం, ఆర్టీసీ కాలనీ, ఎస్ వి యన్ కాలనీ, సాంబశివపేట) వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వప్నశ్రీనాథ్ మాట్లాడుతూ కష్టపడకుండా ఏది ఊరికే రాదని కఠోర శ్రమతోనే లక్ష్యాలను సాధించగలమన్నారు. తల్లిదండ్రులు పిల్లల మనసెరిగి నడుచుకుంటూ వారు ఏఏ రంగాల్లో తమ ఆసక్తిని కనబరుస్తున్నారో గ్రహించి వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మీరు ఏం పనిచేస్తున్నారో దానిని సంతోషంగా చేయడం ద్వారా జీవితంలో ఆనందంగా ఉండడంతో పాటు గొప్ప విజయాలు మీ సొంతమవుతాయన్నారు. భాష్యం పూర్వ విద్యార్థి డాక్టర్ ప్రసన్నజ్యోతి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వెన్నుదన్నుగా నిలిచి వారిని అన్ని విధాలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మిమ్మల్ని మీరు నమ్మి కష్టపడితే గొప్ప విజయాలను కైవసం చేసుకుంటారన్నారు. తొలుత ముఖ్య అతిథుల చేతులమీదుగా జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థినీ, విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ జోన్-2 జెడ్ఈఓ స్వప్న, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ స్వప్నశ్రీనాథ్, తదితరులు

తులసి సీడ్స్‌లో జాతీయ భద్రతా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా బుధవారం తులసి సీడ్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ అధ్యక్షత వహించారు. భద్రతా పతాకాన్ని ఆవిష్కరించి, సిబ్బంది చేత భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. సహజంగా కర్మాగారాలలో జరిగే ప్రమాదాలు ఎలా ఉంటాయి, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశంపై యోగీష్ కార్మికులకు ప్రదర్శన రూపంలో ఒక అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కోస్టల్ ప్యాకేజింగ్స్, చైతన్యా ప్యాకేజింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, తులసి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యాక్టరీలకు సంబంధించిన ప్రొడక్షన్ మేనేజర్స్, సిబ్బంది, కార్పొరేట్ హెచ్.ఆర్. శ్రీ వడ్లమూడి రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తులసి యోగీష్



కళాశాలకు అందచేసిన బెంచీలతో ప్రకాష్‌రెడ్డి, కళాశాల సెక్రెటరీ తదితరులు

అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

తాము జీవితాలలో గొప్ప స్థితిలో ఉండటానికి ప్రధాన కారణమైన విద్యాసంస్థల అభివద్ధి లో పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని టిజెపియస్ కళాశాల సెక్రటరీ, కరస్పాండట్ కె.వి.బ్రహ్మం తెలియచేశారు.1975-78వ సంవత్సరంలో టిజెపియస్ కళాశాల లో డిగ్రీ చదివిన లాయర్, ట్యాక్స్ ప్రాక్టీష్నర్ శనగ ప్రకాష్‌రెడ్డి కళాశాల ప్రాంగణంలో, క్రీడా మైదానంలో కూర్చోడానికి సిమెంట్ బెంచ్‌లు వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి పూర్వ విద్యార్థుల అధ్యక్షులు పోలిశెట్టి జ్ఞాన్‌దేవ్, సెక్రెటరీ చక్క అధిపతిరావు, వైస్ ప్రెసిడెంట్ మద్ది రాధాకష్ణ, కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, శనగల ప్రమీల కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న జిల్లా స్థాయి వేడుకలను గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర మహిళ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికతో ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. మహిళా సాధికారిత, జీవనోపాదులు మెరుగుదలకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల అమ్మకాలకు రూపొందించిన ఈకామర్స్ యాప్ ద్వారా కొనుగోలు జరిగేలా గ్రామీణ ప్రాంతాల్లో డిఆర్డిఏ, పట్టణ ప్రాంతాల్లో మెప్మా అధికారులు డ్వాక్రా మహిళలను సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాదుల మెరుగుదలకు నిర్దేశించిన సంక్షేమ పథకాలు ఈ -బైకు, ఈ-ఆటో, ఇతర స్వయం ఉపాధి పథకాల ద్వారా మంజూరు చేసిన యూనిట్లు మహిళా దినోత్సవం నాటికి గ్రౌండిగ్ జరిగేలా బ్యాంక్ అధికారులతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. వివిధ శాఖల ద్వారా మహిళ సంక్షేమం, ఆర్థిక అభివద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరిస్తూ సభా ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ సుప్రజ, డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ జయలక్ష్మి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

మహిళా సాధికారతే దేశానికి రక్ష

ప్రజాశక్తి-గుంటూరు

దేశ జనాభాలో సగభాగంపైగా ఉన్న మహిళలు విద్య ఉద్యోగ పారిశ్రామిక రంగాలలో ఉన్నత స్థానాలలో నిలదొక్కుకోవడం దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని రోటరీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ రవి వడ్లమాని అన్నారు.స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కాలేజిలో బుధవారం కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సహకారంతో అడ్వాన్స్డ్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఏ) ఇండియా, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ముందస్తు ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సభకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రమజ్యోత్స్న కుమారి అధ్యక్షత వహించగా రవి వడ్లమాని మాట్లాడుతూ మదర్ తెరిసా ఆశీస్సులతో బాలిక విద్య ప్రాధాన్యత గుర్తించి 1000కి పైగా పాఠశాలలకు భవనాలు, మౌలిక సౌకర్యాలు ఏర్పరచడంతో పాటు ఐదున్నర లక్షల బెంచీలను అందించమన్నారు. ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయం సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ టి.డి. విమల మాట్లాడుతూ కళాశాల స్థాయిలో విద్యార్థినిలు ప్రతిభ, జ్ఞాన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ నీలిమ, డాక్టర్ ఎస్.హసీనా, డాక్టర్ పి.నీరజ, డాక్టర్ పి.శిరీషరాణి, డాక్టర్ షబానా అజ్మీ, కాపు శ్యామలను సత్కరించి, కె.నిరంజన్‌రెడ్డి మెమోరియల్ అవార్డులను అందజేశారు.కార్యక్రమంలో ఏపీఏ జాతీయ చైర్మన్ డాక్టర్ బి.కృష్ణభరత్, జాస్తి రాజేశ్వరి, కె శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి వడ్లమాని

జనరిక్ మందులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రధానమంత్రి ప్రారంభించిన జన ఔషధి వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షత వహించి జన ఔషధి షాపులలో బ్రాండెడ్ ఔషధాలకంటే జనరిక్ ఔషధాలు తక్కువ ధరకు లభిస్తాయని, వాటి వాడకాన్ని ఫార్మసీ నిపుణులు, డాక్టర్లు ప్రోత్సహించాలని అన్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టం శ్రీమంత్ కుమార్ మాట్లాడుతూ జనరిక ఔషధాలు ప్రజలకు అందుబాటులోకి తేవటం ద్వారా ఆరోగ్య సంరక్షణకు అయ్యే ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. ఎయిమ్స్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమ్యజ్యోతి మాట్లాడుతూ జన ఔషధి స్టోర్స్‌లో లభ్యమయ్యే ఔషధాలు వైద్య పరికరాలు నాణ్యత ప్రమాణాలతో తయారు చేసినవేనని ఫార్మసీ విద్యార్థులు వాటిని తెలుసుకొని వాటి వాడకాన్ని ప్రోత్సహించాలని అన్నారు. జనఔషధి నోడల్ ఆఫీసర్ ఎ.హరికృష్ణ జనఔషధి స్టోర్స్ ప్రారంభించటానికి అవసరమైన వసతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



ఎయిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీమంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, తదితరులు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

చిప్స్ కాలేజి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో కాలేజిలో బుధవారం వివిధ సంస్థలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి.ఒమేగా హెల్త్‌కేర్, మెడిటెక్ హైర్, వేదిక్ బిజినెస్ సొల్యూషన్స్ సంస్థలు పాల్గొన్నాయి. ఈ ప్రాంగణ ఎంపికలకు రాష్ట్రంలోని వివిధ ఫార్మసీ కాలేజిల నుండి 200 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలిపారు. ఈ నియామకాల్లో 98 మంది తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు, కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రెటరీ సిఎస్.శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ ఆర్.గోపాలకృష్ణ, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వి.వెంకటరావు అభినందించారు.

ఎల్.ఎల్.బి పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్ 15వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఎల్ఎల్బీ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఏ .శివప్రసాదరావు బుధవారం తెలిపారు. ఐదు సంవత్సరాల ఎల్.ఎల్.బి ఒకటవ, 3వ సెమిస్టర్ లకు, మూడు సంవత్సరాల ఎల్.ఎల్.బి ఒకటవ , ఆరవ సెమిస్టర్ పరీక్షలకు, ఐదు సంవత్సరాలకు ఒకటవ ఐదవ పదవ సెమిస్టర్ లకు, ఎల్ ఎల్ ఎం కోర్సులో ఒకటవ మూడవ సెమిస్టర్ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. మార్చి 10వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. వంద రూపాయలు అపరాధ రుసుముతో 12వ తేదీ వరకు చెల్లించవచ్చునన్నారు. ఇతర వివరములకు ఆచార్య నాగార్జునయూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలిపారు.